Registered : RN 1156 / 57

No. A.P. / VJA / 52 / 8 / 2000

# నెల్లూరు మునిసిపాలిటీ

మొదటి పేజీ తరువాత

మునిసిపల్ వ్యవహారాలు వాటంతట అవి కొనసాగుతుంటే వీరెక్కడ తన్నుకుని చచ్చినా ఇబ్బంది లేదు. కాని అదే జరగడం లేదు. ఛైర్మన్, కౌన్సిలర్లు జగడాలతో కాలక్షేపం చేస్తుంటే; కమీషనర్ వంటి అధికారులు వున్న దంతా దోచుకునే పనిలో పడిపోయారు. పుర పాలనను పట్టించుకునే వారే లేరు.

దర్గామిట్ట ప్రాంతంలో కొళాయిలు ఎండిపోయి నెల గడిచిపోయింది. రెండు రోజులకొకసారి మాత్రమే నీరు వదులుతున్నారు. జండావీధి, చిన్నబజారు వంటి ప్రాంతాలలో వరసగా 20రోజుల పాటు మంచి నీళ్లు వదలలేదు. నీళ్లకు కొరత వుంటే ఎవరు చేయగల్గింది ఏదీ వుండదు; కాని సమస్య నీళ్లది కాదు - అవినీతిది! వాటర్ వర్క్స్ దగ్గరవుండే మోటార్ల రిపేర్లు అధికారుల పాలిట కామధేనువుగా మారిపోయింది. నాలుగు రోజులకొకసారి కాలి పోతాయవి; లక్షలు ఖర్చు పెట్టి రిపేరు చేసినట్లు బిల్లులు వ్రాస్తున్నారు; మళ్లీ నాలుగంటే నాలుగు రోజులకు కథ పునరావృతం. ఈ రిపేరు చేసే సంస్థలకు, అధికారులకు లాలూచీ వుంది. వాటాలున్నాయి. తమ చిల్లర డబ్బు కక్కుర్తికి కొన్ని వేల మంది జనం త్రాగను నీళ్లు లేక అల్లాడుతున్నా వీరికి లక్ష్యం లేదు. వీరింత నిర్భయంగా అవినీతికి పాల్పడి జనాన్ని హింసిస్తున్నా అడిగేవారు లేరు. రౌతు మెత్తనైతే గుర్రం మూడు కాళ్ల మీద కుంటుతుందని వూరకే అనలేదు కదా? ఛైర్మన్ గట్టిగా దబాయించగల్గితే అధికారులు దారికి రాకుండా ఎట్లా వుంటారు. కాని ఆమెకు అందుకు తీరిక లేదు - వున్న పుణ్యకాలం కాస్తా కౌన్సిలర్లతో జగడాలతో సరిపోతున్నది.

శానిటరీ ఇన్స్పెక్టర్లది మరీ విచ్చలవిడి. దాదాపు 800 మంది శానిటరీ వర్కర్లు వీరి క్రింద పనిచేస్తున్నారు. దిన భత్యం క్రింద పనిచేసేవారి సంఖ్య మరొక మూడు నాలుగు వందల వరకు వుంటుంది. వీరి హాజరు పట్టీలు నిర్వహించే బాధ్యత ఇన్స్పెక్టర్లదే. ఆ బాధ్యత వారికి బంగారు గని పంటిది. ప్రతి ఇన్స్పెక్టర్ రెండు అటెండెన్స్ రిజిష్టర్లు నిర్వహిస్తున్నాడు. ఒకటి అసలు, మరొకటి నకిలీ. ఆఫీసుకు తెచ్చి చూపించే రిజిష్టర్‌లో ఆబ్సెన్స్ మార్కులు వుండవు. అందరు సిబ్బంది, నెలలో అన్ని రోజులు డ్యూటీకి వచ్చినట్లే వుంటుంది. ఆ ప్రకారం జీతాలు లెక్కగట్టి, డ్రా చేసి తీసుక వెళ్తారు. ఇచ్చేది మాత్రం అసలు అటెండెన్స్ రిజిష్టర్ ప్రకారం. ఈమధ్యలో తేడా నెల నెలా లక్షల్లో వుంటుంది. అందరికీ వాటాలున్నాయి. దీన్ని నివారించడానికి ఎందువల్లనో కమీషనర్ గారు చిన్న ప్రయత్నం చేశారు. సిబ్బంది జీతాలు శానిటరీ ఇన్స్పెక్టర్ల ద్వారా కాక నేరుగా ఆఫీసు నుంచి ఇవ్వాలని ఆర్డర్ చేశారాయన. అంతే - టౌన్లోని పెద్ద పెద్ద రాజకీయ నాయకులందరూ ఆఫీసు మీదకు దండెత్తి వచ్చేశారు. కమీషనర్ను నోటికొచ్చినట్లు తిట్టారు. అవి బూతులు కాదు. స్వాక్షాత్తు ఎమ్మెల్యే గారు కూడా యుద్ధానికి తరలి వచ్చారు. ఇంత మంది తన మీదకు దాడికి రావడంతో పాపం కమీషనర్ గుక్క తిప్పుకోలేక, శానిటరీ ఇన్స్పెక్టర్ల ఇష్ట ప్రకారం జీతాలు వారి చేతిలోనే పెట్టి చెంపలు వాయించుకున్నాడు.

ఒక రిద్దరు అవినీతి పరులైన అధికారులకు కష్టం కల్గడంతో కొంపలు మునిగిపోయినట్లు ఆగం సృష్టించిన టౌన్ నేతలు నీళ్లు లేక, వీధి దీపాలు వెల్గక, చెత్త ఎత్తేవారు లేక, దోమలు మందు చల్లేవారు లేక టౌన్ జనమంతా నానా బాధ పడుతుంటే ఎందుకు స్పందించడం లేదో అర్థం కాదు. నేతలకు కావల్సింది జనం సుఖం కాదు, తమ చేతి క్రింద పడి వుండే అవినీతిపరుల భద్రత. ఈ అధికారుల ఆదాయం తగ్గిపోతే తమ రాబడి కూడా తగ్గిపోతుందన్న భయం వీరిని ఇంత రచ్చకు ప్రేరేపించింది.

గత రెండు వారాలుగా మునిసిపాలిటీకి అమ్మ అబ్బ లేదు. శానిటరీ ఇన్స్పెక్టర్ల వ్యవహారంలో తనకు జరిగిన పరాభవానికి కుమిలి పోయిన కమీషనర్ సెలవు పెట్టి వెళ్లి పోయాడు. హెల్త్ ఆఫీసర్ కూడా ఆయన దారిలోనే జారుకున్నాడు. నోరూవాయి లేని మునిసిపల్ ఇంజనీర్ ఒకరిని ఇన్‌ఛార్జిగా పెట్టారిప్పుడు. దానితో సిబ్బంది ఆడింది ఆట పాడింది పాటగా వుంది. ఒక్కరు కూడా పనిచేయడం లేదు. వీధులలో చెత్త ఎత్తేవారు లేక ఎక్కడ చూసినా మురికి తాండవిస్తున్నది. చెత్త ఎత్తే కాంట్రాక్ట్ సమస్తం కౌన్సిలర్లు పంచుకున్నారు. ఒక కౌన్సిలర్‌కు నాలుగు ట్రాక్టర్లు కూడా వున్నాయట. అవి పొరపాటున కూడా వీధులలో కన్పడడం లేదు. నెల నెలా బిల్లులు మాత్రం మంజూరై పోతున్నాయి. కౌన్సిలర్ల చేత పని చేయించే సత్తా అధికారులకు ఎక్కడ వుంది?

చెత్త పేరుతోనే ఇప్పటికి ఒక కోటి రూపాయల వరకు స్వాహా అయి పోయిందని అంచనా. ఇంజనీరింగ్ శాఖలో మరొక ప్రక్క దొంగ బిల్లులు దినచర్యగా మారిపోయింది. ఈ ఏడాదిలోనే దాదాపు పది కోట్ల వరకు ధన దుర్వినియోగం జరిగిందని చెప్తున్నారు. లోకాస్ట్ శానిటరీ వంటి పథకాల సంగతి చెప్పనే పనిలేదు. అధికారులు, కౌన్సిలర్ల పాలిట కామధేనువుగా మారిపోయాయవి.

మొత్తం మీద నెల్లూరు మునిసిపాలిటీ పరిపాలనాపరంగా చండాలంగా వుంది. దిక్కు దివాణం లేనితనంగా తయారయ్యింది. మరి కొన్ని రోజులు ఇదే పరిస్థితి గడిస్తే మునిసిపాలిటీ పూర్తిగా మూంత మోసి పోవడం ఖాయం. జిల్లా కలెక్టర్ వంటి వున్నతాధికారులు గాని, జిల్లా మంత్రి ఆదాల ప్రభాకరరెడ్డి కాని ఈ దుస్థితిని పట్టించుకోవడమో, లేదా హైదరాబాద్ నుంచి మునిసిపల్ వున్నతాధికారులను పిలిపించి సరిదిద్దడమో చేయడం చాలా అవసరం. ఇంత పెద్ద నగర పాలక సంస్థ హీనంగా తయారు కావడం ఎవరికీ మంచిది కాదు. ఛైర్మన్, కౌన్సిలర్లు తమ తప్పు తెల్సుకుని, రాజకీయ కీచులాటలు కొంత కాలమైనా ప్రక్కన పెట్టి ప్రజా సంక్షేమం పట్టించుకోలేరా? *


అమెరికన్ బయోగ్రాఫికల్ ఇన్స్టిట్యూట్ వారి ఇంటర్నేషనల్ ఆఫ్ ప్రొఫెషనల్ అండ్ బిజినెస్ ఉమెన్ అవార్డును జిల్లామంత్రి ఆదాల ప్రభాకర రెడ్డి చేతుల మీదుగా అందుకొంటున్న వసంతలక్ష్మి ఛారిటబుల్ ట్రస్ట్ ఛైర్మన్ టి. వసంతలక్ష్మి, ప్రక్కన చిన్నపిల్లల వైద్యుడు రవి వున్నారు.


# ఉత్తరక్రియలు

మా ఇంటి ఇలవేల్పు, మమతానురాగాల మాదైవం

## శ్రీ వేమిరెడ్డి శివకోటారెడ్డి గారు

6.3.2001 తేది మంగళవారం మమ్ములను వదలి దైవసాన్నిధ్యానికి చేరారు.
వారి పవిత్ర ఆత్మకు చిరశాంతి కలగాలని భగవంతుని ప్రార్థిస్తున్నాము.


జననం 28.12.1919
మరణం 6.3.2001

కీ.శే. వేమిరెడ్డి శివకోటారెడ్డి గారు
రామమూర్తినగర్, నెల్లూరు

### ఉత్తరక్రియలు

21.3.2001 తేది బుధవారం సాయంత్రం 6 గంటలకు నిలుపు
22.3.2001 తేది గురువారం ఉదయం 9.30 గంటలకు ఎత్తురేవు
నెల్లూరు రామ్మూర్తినగర్‌లోని వేమిరెడ్డి ప్రభాకర రెడ్డి స్వగృహమున జరుగును.
కావున తెలియజేయడమైనది.

వేమిరెడ్డి శ్యామలమ్మ – (భార్య)
వేమిరెడ్డి కోటారెడ్డి ... రమాదేవి – (కుమారుడు ... కోడలు)
వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి – (కుమారుడు)
సి. అశోక్ రెడ్డి ... శశికళ – (అల్లుడు ... కుమార్తె)

RAJI ADS, PH: 324110


Edited, Printed and Published by N. Dolendra Prasad at Zaminryot Press, Ph: 0861-327354, Offset Printing at Zaminryot Press, Nellore